కరీంనగర్ సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
బుధవారం 27 డిసెంబర్ 2023 9 పేజీలు

# నేడు జిల్లా ఇంఛార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జి మంత్రి అయిన రాష్ట్ర ఇరిగేషన్, సిఏడి పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లు కరీంనగర్ లో నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమం రివ్యూ సమావేశమునకు హాజరవుతున్నారని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు.బుధవారం 27వ తేదీన ఉదయం 11.00 గంటలకు నిర్వహించు ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

# ఆరు గ్యారంటీలపై... ఆశలెన్నో..

- రేపటి నుంచి 'ప్రజా పాలన' సభలు
- గ్రామాలు, వార్డుల వారీగా దరఖాస్తుల స్వీకరణ
- సొంతింటి కల.. గ్యాస్ రాయితీపై అమితాసక్తి
- సర్కారు సాయంతో కౌలు రైతులకు ఉపశమనం
- కొత్త పథకాల అమలుపై లబ్ధిదారుల్లో ఆతృత







**సూర్య కోనరావుపేట**

కొత్త ప్రభుత్వం అమలు చేయమన్న ఆరు గ్యారెంటీలపై జనాలు అనేక ఆశలు పెట్టుకు న్నారు. అధికారంలోకి వస్తే ఖచ్చితంగా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం. చెప్పినట్లు గానే కార్యా చరణ ప్రారం భించింది. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన' పేరిట గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో సభలు నిర్వహించేందుకు సిద్ధమవు తోంది. ఇప్పటికే ఈసభలకు సంబం ధించి విధివిధా నాలను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికా రులకు వివరించడంతో పాటు మార్గద ర్శకాలను విడుదల చేసింది. దీంతో అధికార యంత్రాంగం ఆయా సభల నిర్వహణకు కసరత్తు ప్రారంభిస్తోంది. మరోపక్క గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు కాంగ్రెస్ (మిగతా 2లో)

# నేడు సింగరేణి ఎన్నికలు

**- ఉదయం 7 నుండి 5 వరకు పోలింగ్..**

**- అనంతరం ఓట్ల లెక్కింపు... ఫలితాలు వెల్లడి.....**



**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. 6 గంటల నుండి ఓట్ల లెక్కింపు, రాత్రి వరకు ఫలితాలు వెల్లడించనున్నట్లు హైదరాబాద్ రీజినల్ డిప్యూటీ లేబర్ కమిషనర్, ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. సంస్థవ్యాప్తంగా 11 ఏరియాలలో మొత్తం 39,832 మంది సింగరేణి కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రామగుండం ఏరియాలో మూడు డివిజన్ లలో 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారులుగా డివిజన్ కు ఒక ఆర్డిఓ ను నియమించారు. సింగరేణిలో జరుగుతున్న ఎన్నికలలో ఏఐటీయూసీ , ఐఎన్టీయూసీ యూనియన్ లు ఎలాంటి పొత్తు లేకుండా పోటీలో తలబడనున్నాయి. అసెంబ్లీలో దోస్తీ...సింగరేణిలో కుస్తీ... పడుతున్న ఈ రెండు ప్రధాన యూనియన్ల మధ్య పోటీ ఉండే అవకాశం కనిపిస్తుంది. ఎవరికివారు గెలిచేది తామే అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికలలో ఎవరు గెలుస్తారు అని కోల్ బెల్ట్ ప్రాంతం తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

### తబ్లిగీ జమాతేకు నిధులిచ్చిన సర్కార్..

# స్వాములకు సౌకర్యాలకు నిధులెందుకు ఇవ్వడం లేదు?

**- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్**

**- పాస్టర్లకు, ఇమామ్ లకు జీతాలిస్తూ అర్చకులు, గురువులను గాలికొదిలేస్తారా?**

**- హిందూ మత విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర జరుగుతోంది**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



తీవ్రవాదులను తయారు చేస్తూ బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడుతున్న తబ్లిక్ జమాతే సంస్థకు నిధులిస్తున్న ప్రభుత్వం 41 రోజుల కఠోర దీక్ష చేసే అయ్యప్ప స్వాములకు సౌకర్యాలు కల్పించేందుకు నిధులెందుకు కేటాయించడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. శబరిమలలో గత కొద్దిరోజులుగా అయ్యప్ప స్వాములు పడుతున్న బాధలు మీ కళ్లకు కన్పించడం లేదా? అక్కడ తాగడానికి నీళ్లు లేవు. తినడానికి తిండి లేదు. గజగజ వణికి చలిలో గంటల తరబడి నిలబడి అరిగోస పడుతున్న దారుణ ద్రుశ్యాలు మీడియా, సోషల్ (మిగతా 2లో)



# కొత్త ప్రభుత్వంలోనైనా నిగ్గు తేలుస్తారా..

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరీలో రాజ్యమేలిన అవినీతి
- ప్రజా ప్రతినిధుల అండతో అనర్హులకే ఇళ్ల కేటాయింపు
- ఇంటికి లక్ష వసూలు చేసిన ప్రజాప్రతినిధులు?
- ఆధారాలతో సహా బయటపెట్టినా అధికారుల చర్యలు శూన్యం
- పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించుకోని అధికార గణం
- చర్యలు తీసుకోవాల్సింది జిల్లా కలెక్టరేనంటూ చేతులెత్తేస్తున్న మున్సిపల్ అధికారులు.




**సూర్య రాజన్న సిరిసిల్ల.**

పేదవాడి సొంతింటి కలను నిజం చేయడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవినీతి రాజ్యమేలింది. సిరిసిల్ల పట్టణంలోని లబ్ధిదారులకు కేటాయించేందుకు నిర్మించిన మండేపల్లిలోని కేసీఆర్ నగర్లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అనర్హుల (మిగతా 2లో)



# ఆరు గ్యారంటీలపై.... ఆశలెన్నో

(మొదటి పేజీ తరువాయి)

కొన్నింటిని కొత్తగా అమలు చేయనుండటంతో జనాల్లోనూ అమితాసక్తి నెలకొంది. నిరుపేదలకు అత్యవసరమైన సొంతింటి కలతో పాటు రూ. 500లకే గ్యాస్ సిలిండర్ తో పాటు కౌలు రైతులకు ఆర్థికసాయంపై ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆయా పథకాల అమలుపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం. కొత్త సర్కార్ కొలువుదీరడంతో జనాలు సంక్షేమ కార్యక్రమాలపై భారీగా ఆశలు పెట్టుకున్నారు.గతంలోను సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలైన, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలపై మాత్రం జనం భారీగా నమ్మకం పెట్టుకున్నారు. ఇది వరకు పెన్షన్స్, రైతుబంధు వంటి మంచి పథకాలు వచ్చినా.. తాజాగా వీటి పెంపుతో పాటు కొత్త పథకాల అమలు కానుండడంతో జనంలో ఆసక్తి నెలకొంది.ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజులకే మహాలక్ష్మీపథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలను ఉచితప్రయాణాన్ని ప్రారంభించింది.చేయూత పథకంలో భాగంగా ఆరోగ్య శ్రీ వైద్యాన్ని రూ.10లక్షలకు పెంచింది.వీటితో పాటు మిగిలిన వాటిని సైతం వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో జనాలు వాటి పై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ఇది వరకు రైతులకు రైతుబంధు ఎకరానికి రూ. 10వేల చొప్పున అందజేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఈ సాయాన్ని రూ. 15వేలకు పెంచింది.ముఖ్యంగా గతంలో ఎన్నడు లేని విధంగా కౌలురైతులకు కూడా ఈ సాయం వర్తింపజేస్తామని ప్రకటించడంతో కష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నకౌలు రైతులకు ఉపశమనం లభించనుంది. ముఖ్యగా వ్యవసాయ కూలీలకు సైతం రూ. 12వేలు అందిస్తామని స్పష్టం చేసింది.వీటితో పాటు గత ప్రభుత్వం డబులబెడ్ రూంలు అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నిర్మించి వదిలేసింది.కానీ తాజాగా కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ. 5 లక్షలు వెచ్చించనుంది. వీటికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు గృహనిర్మాణశాఖను పునరుద్ధరించనుంది. దీంతో ఇండ్లు లేని వేలాది మందినిరుపేదలు ఈ పథకంపై ఆశగా ఎదురుచూస్తున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక అవస్థలు పడిన పేదలకు ప్రభుత్వం గృహజ్యోతి పేరిట 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించనుంది. ముఖ్యంగా ప్రస్తుతం గ్యాస్ సిలెండర్ కోసం రూ. 1100 వరకు వెచ్చించాల్సివస్తోంది. కానీ కాంగ్రెస్ సర్కారు రూ. 500 సిలిండర్అందజేస్తామని చెబుతోంది.

**- ఈ నెల 28 నుంచి దరఖాస్తులు**

ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల అమలులో భాగంగా ఈనెల 28వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించనుంది. ఈ సభల్లోనే మహాలక్ష్మిరైతు భరోసా గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు,చేయూత పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అందుకు అధికార యంత్రాంగం గ్రామాలు, మున్సిపల్ పలు వార్డుల్లో సభలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది.ఈ పథకాలతో పాటు ప్రత్యేకంగా రేషన్ కార్డుల కోసం సైతం కౌంటర్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. డిసెంబర్ 31. జనవరి 1వతేదీల్లో మినహాయిం చి ఎనిమిది రోజుల పాటు ఈ దరఖాస్తులు తీసుకుంటారని అధికారవర్గాలు చెబుతున్నాయి. గతంలో పొందిన కొన్ని పథకాలతో పాటు కొత్తగా మరిన్ని అమలు కానుండడంతో లబ్ధిదారుల్లో ఆతృత నెలకొంది. ఈ సమాజ సక్రమంగా అమలు చేస్తే పేదల జీవితాల్లో కొంతైనా మార్పు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది..

# కొత్త ప్రభుత్వంలోనైనా నిగ్గు తేలుస్తారా..

(మొదటి పేజీ తరువాయి)

చేతికిందాయి. ప్రజా ప్రతినిధుల అండదండలతో నిజమైన పేదవాడికి అందాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కొంతమందికి గెస్ట్ హౌస్ లుగా మారాయి. మరోవైపు అనర్హులను నిగ్గు తేల్చి అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించాల్సిన అధికారులు ఆమ్యామ్యాలు దండుకొని ప్రజాప్రతినిధులు సూచించిన వారికి ఇండ్లని కేటాయించారు. ఇంకోవైపు స్థానిక ప్రజా ప్రతినిధులు ఒక్కో ఇంటికి లక్ష వరకు వసూలు చేసి అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించేలా ప్రత్యేక చొరవ చూపారన్నది బహిరంగ రహస్యమే.

**-కేటీఆర్ హెచ్చరించిన తగ్గని ప్రజాప్రతినిధులు.**

సిరిసిల్ల పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మొత్తం 70363 దరఖాస్తుల రాగా అధికారులు ఆరుసార్లు గ్రామసభలు, సర్వేలు నిర్వహించి 2767 మందిని అర్హులుగా తేల్చారు. అయితే మొత్తం నాలుగు చోట్ల కలిపి సిరిసిల్ల పట్టణంలోని లబ్ధిదారులకు నిర్మించిన ఇండ్లు 2052 మాత్రమే. ఈ ఇళ్ల కేటాయింపు కోసం డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేసే ప్రక్రియను చేపట్టారు. ఇక్కడే స్థానిక ప్రజా ప్రతినిధులు తమ చేతివాటం చూపించారు. డ్రాలో పేరు రావాలంటే లక్ష రూపాయలు ఇవ్వాల్సిందేనంటూ లబ్ధిదారులతో బేరాలు కుదుర్చుకున్నారు. 50 వేల నుండి లక్ష రూపాయల వరకు లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసినట్టు సోషల్ మీడియాతో పాటు పత్రికల్లో సైతం వార్తలు వచ్చాయి. సాక్షాత్తు అప్పటి పురపాలక శాఖ మంత్రి, ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల నుండి కొంతమంది కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పడం గమనార్హం. వెంటనే వారి డబ్బులు వారికి ఇచ్చివేయాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించడం కూడా జరిగింది. అయితే నాటి మంత్రి మాటలను బేఖాతరు చేస్తూ చాలామంది కౌన్సిలర్లు పలువురి వద్ద నుండి డబ్బులు తీసుకుని ఇండ్లను కేటాయించేలా చేశారన్నది లబ్ధిదారుల ప్రధాన ఆరోపణ. దాదాపు మూడు సంవత్సరాల క్రితమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయినప్పటికీ గత సంవత్సరమే ఇళ్ల పంపకాన్ని ప్రారంభించి ఇప్పటివరకు కేవలం 1720 ఇళ్లను మాత్రమే పంపిణీ చేశారు. మరో 300 ఇళ్ల వరకు ఇంకా లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది.

**-ఆధారాలతో బయటపెట్టినా చర్యలు తీసుకోని అధికారులు**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అనర్హులకు కేటాయించా రంటూ ఆధారాలతో సహా పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు .అనర్హుల వివరాలను, వారు ప్రస్తుతము ఉంటున్న ఇంటి నెంబర్ తో సహా పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ ఎంక్వయిరీ చేయించిన దాఖలాలు లేవు. మరి కొంతమంది లబ్ధిదారులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నట్లు సమాచారం లేదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ఏ చర్యలు అయినా తీసుకోవాల్సింది జిల్లా కలెక్టర్ మాత్రమేనని మునిసిపల్ అధికారులు చేతులెత్తేయడం విశేషం.

**-గెస్ట్ హౌసులుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు**

సిరిసిల్ల పట్టణం లోని లబ్ధిదారులకు మండేపల్లి లోని కేసీఆర్ నగర్ తో పాటు పెద్దూరులో కేటాయించిన ఇల్లు గెస్ట్ హౌస్లుగా మారిపోతుం న్నాయి.అప్పటికే ఇల్లున్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించడంతో వారు సిరిసిల్లలోనే ఉంటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గెస్ట్ హౌస్లుగా మార్చుకుంటున్నారు .మండేపల్లి లోని కేసీఆర్ నగర్లో కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 30 శాతం వరకు ఖాళీగా ఉన్నాయ ంటే ఎలాంటి వారికి ఇల్లు కేటాయిం చారో అర్థం చేసుకోవచ్చు.

**- కొత్త ప్రభుత్వంలోనైనా నిగ్గు తేలుస్తారా..**

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కొత్తగా పదవి బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై విచారణ జరిపించి, అనర్హులం తొలగించి, అర్హులకు కేటాయించే దిశగా ప్రయత్నాలు జరుగుతాయా అన్నది చూడాల్సి ఉంది. కనీసం ఫిర్యాదులు అందిన వాటి పైన అయినా విచారణ జరిపించి అర్హులకు ఇండ్లు కేటాయించాల్సి ఉంది. మరోవైపు గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు హడావుడిగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రానివారికి కేటాయించిన ఇళ్ల స్థలాలు, గృహలక్ష్మి పథకం కింద వచ్చే మూడు లక్షల రూపాయలపై కూడా సందిగ్ధత నెలకొని ఉంది. కొత్త ప్రభుత్వంలోనైనా అర్హులకు న్యాయం జరుగుతుందా అన్నది చూడాల్సి ఉంది.

# ధర్మారంలో దొంగల బీభత్సం...

**- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ...**

**సూర్య, కోనరావుపేట**



కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డారు.పోలీసులు బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామంలోని గుర్రం అంజయ్య కుటుంబ సభ్యుల దైవ దర్శనానికి ఈనెల 21న తిరుపతి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తాళం తీసి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంటి యజమానికి సమాచారం అందించారు.బంధువులు స్థానికులు పరిశీలించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.క్లూస్ టీం ఫింగర్ ప్రింట్స్ ను సేకరించారు.దొంగలు ఇంట్లోకి చొరబడి సామాన్లను చిందరవందర చేసి బీరువా పగులగొట్టి చోరికి పాల్పడ్డారు.యజమాని ఇంటికి చేరుకొని చూడగా బీరువాలో మొబైల్ ఫోన్, రూ.20 వేల విలువైన 4 ఫారిన్ మద్యం బాటిళ్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

# తబ్లిగీ జమాతేకు నిధులిచ్చిన సర్కార్.. స్వాములకు సౌకర్యాలకు నిధులెందుకు ఇవ్వడం లేదు?

(మొదటి పేజీ తరువాయి)

మీడియాలో వస్తున్నయ్. చిన్న పిల్లోడిని కదిలించినా ఆ స్వాముల కష్టాలు చెబుతారు%శా% మరి పాలకులకు కనబడకపోవడం సిగ్గు చేటు"అని అన్నారు. వీర్ బాల దివస్ సందర్భంగా మంగళవారం కరీంనగర్ లోని సిక్కులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బండి సంజయ్ వారితో కలిసి గురుద్వార్ కు విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇదంతా ఒక ప్లాన్ ప్రకారం కుట్ర చేస్తున్నారు. హిందూ మత విశ్వాసాలను దెబ్బతీసేందుకు చేస్తున్న కుట్ర చేస్తున్నారు. ఎక్కువ మంది దర్శించుకునే ధార్మిక ప్రదేశాల్లో భయానక వాతావ రణాన్ని సృష్టిస్తూ, సరైన సౌకర్యాలు కల్పించకుండా చేయడంవల్ల భక్తులు రాకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారు. తిరుమలలోనూ పులులు వస్తున్నాయనే భయంతో భక్తులు రాకుండా చేస్తూ హిందూ సనాతన ధర్మాన్ని దెబ్బతీసేలా కుట్ర జరుగుతోంది అని అన్నారు.హిందూ సమాజమంతా ఆలోచించాలని కోరుతున్నా. మసీదులో పనిచేసే ఇమామ్ లకు, చర్చిల్లో పనిచేసే ఫాస్టర్లకు జీతాలిస్తున్న ప్రభుత్వం ఆలయ పూజారులకు, గురుద్వారాలో పనిచేసే గురువులకు జీతాలెందుకు ఇవ్వడం లేదో ఆలోచించండి. ఒక వర్గం ఓట్ల కోసం హిందూ సమాజాన్ని చీల్చే కుట్ర చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల స్వార్థ రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ దేశంలోని పిల్లలకు, యువతకు స్ఫూర్తి, త్యాగభావం, ధర్మ రక్షణ భావం కల్పించాలనే ఆలోచనతో నరేంద్రమోదీ ప్రభుత్వం ఈరోజు వీర బాల దివస్ ను నిర్వహిస్తున్నారు. ఈ దివస్ వెనుక పెద్ద స్ఫూర్తిదాయకమైన చరిత్ర ఉంది. సిక్కు మతాన్ని వీడి ముస్లిం మతంలోకి మారకపోతే మిమ్ముల్ని చంపేస్తామంటూ చిన్న పిల్లలైన బాబా జొరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ లను మొగల్ చక్రవర్తి ఔరంగజేబు బెదిరించినా, వణికించే చలిలో నిలబెట్టినా, చిత్రహింసలు పెట్టినా భయపడకుండా నమ్మిన మతం కోసం బలిదానం చేసిన త్యాగధనులు. చివరకు ఆ పిల్లలను సమాధి చేయడానికి స్థలం ఇవ్వకుండా వేధించారు. ఎంత స్థలంలో బంగారు నాణేలను కుప్పలు పేరుస్తారో%శా% అంత మేరకు స్థలం ఇస్తామని మొగల్స్ చెబితే%శా% ప్రతి ఒక్క సిక్కు ఆ నాణేలను కుప్పగా పేర్చి ఆ స్థలాన్ని కొని ఆ పిల్లలను సమాధి చేశారు. గురు గోవింద్ సింగ్ పిల్లలే కాకుండా ఆ కుటుంబ యావత్తు బలిదానం చేసిన చరిత్ర చాలా గొప్పది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ , ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు , వీర్ బాల్ దివస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ , మైనార్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బల్బీర్ సింగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపురమేష్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ , జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర , అలువేలు సమ్మిరెడ్డి , గాజే రమేష్ ,సుధాకర్ పటేల్, ఎడమ సత్యనారాయణ రెడ్డి, దండు కొమరయ్య కార్పొరేటర్లుదురిశెట్టి అను ప్, ఎన్నం ప్రకాష్, శ్రీనివాస్, లద్దు ముందడ, వాసు , మాసం గణేష్ , కలికూట మోహన్ ,తనకు సాయి, మామిడి చైతన్య, రమేష్ , కూర మహిపాల్ రెడ్డి ,ఉప్పరపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రాముడి అక్షింతల శోభయాత్ర

**- పల్లకీ లో ఊరేగింపుచేసిన వి హెచ్ పి సభ్యులు**

**సూర్య, ఇబ్రహీంపట్నం**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో అయోధ్య రామమందిర నిర్మాణం లో భాగంగా రాముడి అక్షింతలు గ్రామానికి రాగ సోమవారం గ్రామంలోని అతిపురతన శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి అలయం నుండి అలాయాలలో ప్రదక్షిణ అనతరం శ్రీ సితారామ బలంజనేయ స్వామి అలయం వరకు పల్లకిలో స్వామి ఉత్సవ మూర్తులను, అక్షంతలను మహిళలు మంగళ హారతులు,అంజేనేయస్వామి జెండాలతో ఎదుర్కొంటు రామసంకిర్తణల మధ్య తెచ్చి ప్రత్యేక పుజలు చేసి రామలయ గర్భగుడిలో ఐదు రోజుల పాటు పుజల నిమిత్తం ఉంచారు.అనతరం అర్చకులు భక్తులకు ప్రత్యేక హారతి ఇచ్చి పుజలు చేశారు. కాగ 2024 జనవరి 1 నుండి ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ, దేవలయకమిటీ,సర్పంచ్ సున్నం నవ్యశీ,ఎంపిటిసి దేశెట్టి మమత,ఉపసర్పంచ్ అనతి పెద్ద రాజం ,అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామస్తులు ,యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఈనెల 28న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా తెలంగాణ రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలలో డిసెంబర్ 9న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం మరియు ఆరోగ్య బీమా అనే రెండు గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరిగిందని, ఇక ఈనెల 28 నుండి ప్రజల వద్దకే పాలన అనే ఒక ప్రత్యేక కార్యాచరణతో ప్రజా పాలన అనే కార్యక్ర మాన్ని ప్రారంభించి ప్రజలకు సమర్థవం తమైన సంక్షేమ పాలన అందించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,




మంత్రివర్గంతో కూడిన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణ ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాలోని మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదేశాలతో 1. మహాలక్ష్మి 2. రైతు భరోసా 3. గృహజ్యోతి 4 ఇందిరమ్మ ఇల్లు 5 చేయుత సంక్షేమ పథకాలతో పాటు నూతన రేషన్ కార్డులు అర్హులైన లబ్ధిదారులకు అందించడానికి ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజా పాలనను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధుల సూచనల మేరకు లబ్ధిదారులు ఫారంలను నింపి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అట్టి వివరాలను ప్రభుత్వం డాటా ఇంటర్ విధానం ద్వారా భద్రపరిచి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని ఇట్టి విషయంలో ఎలాంటి లోపాలు ఆటంకాలు కలగకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వారికి చేయూతను అందించాలని ప్రజా పాలన కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పక్షాన కోరుచున్నాము అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామిడి రాజిరెడ్డి సిరికొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర ప్రయివేట్ ఈవెంట్స్, పార్టీలకు, అనుమతి తప్పనిసరి

## - కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



డిసెంబర్ 31వ తేది, నూతన సంవత్సర సందర్భంగా నిర్వహించే ఈవెంట్స్, ప్రైవేటు పార్టీలకు, జనసమూహాలుగా ఏర్పడి నిర్వహించు ఎటువంటి కార్యక్రమాలకైనా కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ముందస్తు అనుమతులు తప్పనిసరని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఇటువంటి కార్యక్రమాలు గాని,పార్టీలు గాని, ముందస్తు అనుమతులు లేకుండా నిర్వహించిన, చట్ట వ్యతిరేక, అసాంఘీక కార్యకలాపాలు, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చాలా కఠినంగా వ్యవహరించడంతోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో చట్ట పరిధిలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

## పెండింగ్ చలాన్ల రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

### - ఎంవిఐ సిరాజ్ ఉర్ రెహ్మాన్

**సూర్య, హుజురాబాద్**



వివిధ వాహనాల పై ఉన్న పెండింగ్ చలాన్ల పై రాష్ట్ర ప్రభుత్వం రాయితీ విధించిందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిరాజ్ ఉర్ రహ్మాన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెండింగ్ చలాన్ల రాయితీపై మంగళవారం 659 జీవోను ప్రభుత్వం విడుదల చేసిందని, రాయితీ ఈనెల 26 నుండి జనవరి 10వ తేదీ వరకు అమల్లో ఉంటుందని అన్నారు. జీవో ప్రకారం ద్విచక్ర వాహనాలైన స్కూటీ, ఆటో, బైక్ లపై 80 శాతం రాయితీ, కారు నుండి లారీ వరకు 60 శాతం రాయితీ, ఆర్టీసీ బస్సులకు 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వంలో పేర్కొందని ఆయన తెలిపారు. వాహనదారులంతా తమ పెండింగ్ చలాన్లను ఈ సందర్భంగా చెల్లించి రాయితీలు పొంది లబ్ధి పొందాలని ఆయన తెలిపారు. ఆన్ లైన్ ద్వారా పెండింగ్ చలాన్లను చెల్లించాలని ఆయన సూచించారు.




## దోపిడీ రహిత సమాజం కోసం సీపీఐ నిరంతరం పనిచేస్తుంది

### - సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి
### - ఘనంగా సీపీఐ 99వ ఆవిర్భావ వేడుకలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

నిరంతరం కార్మిక, కర్షక శ్రేయస్సు కోసం,సమ సమాజ స్థాపన కోసం,మానవ జీవితంలో అంతరాలు లేని దోపిడీ రహిత సమాజం కోసం సీపీఐ నిరంతరం పనిచేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ.సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ పై ఏర్పాటు చేసిన సీపీఐ పతాకాన్ని మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా అనేక కార్మిక,ప్రజా ఉద్యమాలు నిర్వహించి ఎన్నో విజయాలను సాధించిదని, భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో నివసిస్తున్న ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ కావాలని నేటికీ పేదల పక్షాన అనేక పోరాటాలు నిర్వహిస్తుందని ఒక్క సీపీఐ అని అలాంటి సీపీఐ పార్టీ 98 వసంతాలు పూర్తి చేసుకొని 99వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా దేశాన్ని కాపాడుకునేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు, ప్రజాస్వామ్యంను అపహాస్యం చేస్తూ దేశంలో కులాల వారిగా,మతాలవారీగా విభజించి పరిపాలిస్తున్న బిజెపి,ఎన్ డి ఏ కు వ్యతిరేకంగా సీపీఐ శ్రేణులు మరింత ప్రజలకు చేరువై ప్రజోద్యమాలు నిర్వహించాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,సహాయ కార్యదర్శి పైడిపెల్లి రాజు,జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లవ్వ, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్,నలువాల సదానందం,బూడిద సదాశివ, బోనగిరి మహేందర్,సీపీఐ నగర నాయకులు న్యాలపట్ల రాజు,కొట్టే అంజలి,చెంచల మురళి,తంగేళ్ల సంపత్,సాయవేని రాయమల్లు,నునావత్ శ్రీనివాస్, కొమురయ్య, నల్లగొండ శ్రీనివాస్, రమేష్, బాల్ రాజు, కే కుమార్, తంగేళ్ల సదయ్య, ఎం కృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలలో పారమిత విద్యార్థి ప్రతిభ

**సూర్య,కరీంనగర్ రూరల్**



ఇటీవల రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నంలో ఎస్. జి. ఎఫ్ క్రీడల సమాఖ్య వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో పారమిత ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థి కె. అనిరుధ్, అండర్ 14 బాలుర విభాగంలో అత్యధిక ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించిన కె. అనిరుద్ ని పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు మంగళవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, అనుకర్ రావు, వినోదరావు, హనుమంతరావు, వి. యు. ఎం. ప్రసాద్, ప్రధానోపాద్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్ సమన్వయకర్తలు, పి.ఇ.టి వేణు, రాజశేఖర్, సాగర్, వరప్రసాద్ లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### - కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఈనెల 28న ప్రజలకు చేరువుగా పాలనను అందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలోని అర్హులైన నిజమైన లబ్ధిదారులకు దర్శనవారీగా నిర్ణీత కాలవ్యవధిలో సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలను అందించడం కోసం ప్రజల సమక్షంలో వివిధ ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రజలకు సామాజిక ఆర్థిక సాధికారతను చేకూర్చే లక్ష్యంగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమం విజయవంతం చేయడంలో భాగంగా గ్రామీణ ప్రాంతం నుండి మొదలు పట్టణ ప్రాంతం వరకు ప్రజా పాలన కార్యక్రమంలో 1. మహాలక్ష్మి పథకం 2. రైతు భరోసా పథకం 3. గృహ జ్యోతి పథకం 4. ఇందిరమ్మ ఇండ్లు పథకం 5. చేయూత పథకాల గురించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజలకు ఈ సంక్షేమ పథకాల గురించి వివరించడమే కాక ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించవలసిన అవసరం ఉందని అన్నారు. సంబంధిత దరఖాస్తు ఫారంలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులను కోరడంతో పాటు అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయడం విషయంలో అధికారులకు సహకరించాలని క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇట్టి విషయాన్ని ప్రాధాన్యత కలిగిన అంశముగా పరిగణించి పూర్తి శ్రద్ధ వహించగలరని తద్వారా రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువుగా చేయుటకు కృషి చేయలని కోరారు.

## అయోధ్య రామయ్య అక్షింతలు, ఆహ్వాన పత్రికల శోభా యాత్ర

**సూర్య, చొప్పదండి**



అయోధ్య రామయ్య అక్షింతలు, ఆహ్వాన పత్రికల శోభాయాత్ర అయోధ్య రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అయోధ్య శ్రీరామ చంద్రుని చెంత పూజగావింపబడిన అక్షితలను ప్రతి ఇంటికీ చేర్చే కార్యక్రమంలో భాగంగా అయోధ్య నుండి వచ్చిన అక్షితలతో బుధవారం చొప్పదండి పట్టణములో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు పడకంటి కృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు 27వ తేది బుధవారం రోజున ఉదయం 9.00 గ.లకు భక్తాంజనేయ దేవాలయం మార్కెట్ రోడ్ నుండి పట్టణంలోని పుర వీధుల గుండా ఊరేగింపుగా సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలు, అక్షితలతో ఊరేగింపు గా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శోభాయాత్ర లో అయోధ్య ఆలయ నిర్మాణమునకు సహకరించిన దాతలు భక్తులు ప్రతి ఇంటి నుండి మంగళా హారతులతో స్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమం లో సాయి మహిళా సేవా సమితి సభ్యులు , జ్ఞాన సరస్వతి సేవా సమితి మహిళా సభ్యులు, కోలాటలతో, హనుమాన్ సాయి మార్కేండేయా భజన మండలి బృందాలచే బజానాలతో శోభయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ బాంధవులందరు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.




## లస్మక్కపల్లికి చెందిన అభిజ్ఞ కి గిన్నిస్ బుక్ లో చోటు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలం లస్మక్క పల్లి గ్రామానికి చెందిన జంగం అభిజ్ఞ కి గిన్నిస్ బుక్ లో చోటు లభించింది. తపస్వి డాన్స్ అకాడమీ జమ్మికుంట తన మిత్ర బృందంతో కలిసి హైదరాబాద్ లోని గచ్చిబౌళి స్టేడియంలో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. కాగా ఈ పోటీల్లో కళాకారులతో కలిసి సుమారు ఏడు నిముషాల పాటు అభిజ్ఞ నృత్యం చేసింది. ఈ పోటీలకు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ఈ నృత్య పోటీల్లో పాల్గొన్న వీరి కూచిపూడి నాట్యం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ కు ఎంపిక అయినట్లు పర్యవేక్షకుడు రిషినాథ్ తెలిపి వీరి బృందానికి ధ్రువీకరణ పత్రాన్ని భారత్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు కేవీ రమణారావు, అధ్యక్షురాలు లలితకు అందజేశారు. కాగా జంగం అభిజ్ఞ ని తల్లిదండ్రులు డాన్స్ మాస్టర్ శ్వేతరితం మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు అభినందించారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

### - 80 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ

**సూర్య, చొప్పదండి**

చొప్పదండి పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగింది. ఎస్ ఐ ఉపేంద్ర చారి తెలిపిన వివరాలు ప్రకారం పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ కామోజుల రాంకిషన్ రావు స్థానిక సాయి నగర్ లో తన భార్య తో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా ఈ నెల 25న వారి చిన్న కూతురు ఇంట్లో వ్రతం ఉండగా ఇంటికి తాళం వేసి కరీంనగర్ వెళ్లారు. ఈ నేపథ్యంలో మరుసటి రోజు వారి ఇంటి పని మనిషి పని కోసం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉన్నట్టు తెలిపారు. సమాచారం అందుకున్న రాంకిషన్ రావు వచ్చి చూడగా బీరువా తాళం సైతం పగులగొట్టి ఉందని, వస్తువులు చిందర వందర గా ఉన్నాయని తెలిపారు. అయితే బీరువా బ్యాగులో ఉన్న 2 నక్లేస్ లు 50 గ్రాములు,20 గ్రాములు గొలుసు,మరో 10గ్రాములు పచ్చల గొలుసు మొత్తం కలిసి 80 గ్రాములు బంగారు ఆభరణాలు చోరీ కి గురైనట్లు వివరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ ఐ తెలిపారు.

# జగిత్యాలకు చేరుకున్న అయోధ్య అక్షింతలు

## - ఘన స్వాగతం పలికిన వి హెచ్ పి నాయకులు

సూర్య జగిత్యాల



శ్రీరామ జన్మభూమి అయోధ్య నుండి అక్షింతలు మంగళవారం జగిత్యాలకు చేరుకున్నాయి. ఈ అక్షింతలకు పట్టణంలో అపూర్వ స్వాగతం లభించింది. పట్టణంలోని గీత గ్రంథాలయం నుండి అక్షితలను గణేష్ నగర్ లోని గణేష్ మందిరంనకు అత్యంత భక్తిశ్రద్ధలతో అక్షితల కలశాలను తలపైన పెట్టుకుని శ్రీరామ నామ సంకీర్తనలతో పట్టణంలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కోలాటాలు, భజనలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోని కోట్లాది హిందువుల కలలను సాకారం చేస్తూ శ్రీ రామ జన్మభూమి అయోధ్యలో భవ్యమైన ఆలయ నిర్మాణం పూర్తయి జనవరి 22న మందిరం ప్రారంభం అవుతున్న సందర్భంగా 22వ తారీఖు నాడు ప్రాణ ప్రతిష్ట సమయంలో ప్రతి ఇంటిలో అందరూ పూజ చేసుకోవాలని, ప్రతి దేవాలయంలో ఘంటానాదం చేయాలని, సాయంత్రం ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని తెలిపారు. అక్షింతలు జనవరి ఒకటవ తారీఖు నుండి 15వ తారీకు వరకు ప్రతి ఒక్కరికి గడపగడపకు అందిస్తామని వాటిని ఎలా ఉపయోగించుకోవాలని ప్రతి ఇంటికి గడపగడపకు తిరిగి చెబుతామని తెలిపారు. ఈ సందర్భంగా అయోధ్య నుండి వచ్చిన అక్షింతలతో పాటు ఆహ్వాన పత్రాలు, శ్రీరాముల చిత్రపటాన్ని ప్రతి ఇంటింటికి అందించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ వారు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిగంటి ఉమా రవీందర్ దంపతులు, విశ్వహిందూ పరిషత్ జగిత్యాలజిల్లా సహ కార్యదర్శి గాజోజు వర్షిని సంతోష్ దంపతులు, కోశాధికారి మామిడాల రాములు, నగర అధ్యక్షులు జిట్టవేని ఆరుణ్, వడ్లగట్ట భూమేష్, శ్రీధర్, టౌటు రామచందర్, నల్ల నారాయణరెడ్డి, ఎన్నమనేని రామ అశోక్ రావు దంపతులు గుండేటి రాజు ఇతర స్వయంసేవకులు బిజెపి మాజీ కౌన్సిలర్ ఆరవ లక్ష్మి, నిర్మల, అన్నందాస్ రాధిక ఇతర మహిళలు హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా అష్టాదశ కలశ అయ్యప్ప మహాపడిపూజ

సూర్య, కోరుట్ల టౌన్:



కోరుట్ల పట్టణంలో అష్టాదశ కలశ అయ్యప్ప మహాపడిపూజ శ్రీ దుర్గాదేవాలయం (కాలేజ్ గ్రౌండ్ ) ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణకు అయ్యప్ప దీక్షపరుల క్షేమం కొరకు,సకల జనుల శ్రేయస్సు కొరకు లోకకళ్యాణార్థమై హంపీ పీఠాధిపతి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో శ్రీ దుర్గా దేవాలయం ప్రధానార్చకులు పట్టణ పురోహితులు పాలెపు రామకృష్ణ శర్మ వైదిక నిర్వహణలో సోమవారం సాయంత్రం 6:30 ని"లకు అష్టాదశ కలశ మహాపడిపూజ,శ్రీ చక్రార్చన నిర్వహించడం జరిగింది. ఈ మహాపడిపూజలో మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్,గురుస్వాములు దగ్గుల నర్సయ్య,గట్ల ఆనంద్,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సూర్య వెల్గటూర్



భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకుడు దుద్దేల మల్లేష్ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పైడిపల్లి గ్రామంలో సిపిఐ పార్టీ నాయకుడు దుద్దేల మల్లేష్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం మల్లేష్ మాట్లాడుతూ.1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందన్నారు. భూమి, భుక్తి కోసం చేసిన పోరాటాల్లో 4వేల మంది కార్యకర్తలు చనిపోయారని తెలిపారు.తెలంగాణ లో.భూమి లేని నిరుపేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత సీపీఐ పార్టీదే అన్నారు.కార్మిక, కర్షక హక్కులను కాపాడుతూప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడతామన్నారు.అలాగే తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 6 గ్యారంటీ లను ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని.ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను ఖచ్చితంగా నెరవేర్చాలని లేని పక్షంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో.పార్టీ సభ్యులు సంఘ ఐలయ్య, రాకేష్,తిరుపతి, సురేష్,సాయి,చరణ్,కొమురన్న, దుబ్బన్న, తోపాటు కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

సూర్య జగిత్యాల

జగిత్యాల పట్టణంలోని నటరాజ్ టాకీస్ చౌరస్తాలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వేములవాడ కు చెందిన వావిలాల తిరుపతి (20) అనే యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్ కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బీజేపీ పట్టణాధ్యక్షునిగా వెంకటేష్

సూర్య, కోరుట్ల టౌన్



కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షునిగా బింగి వెంకటేష్ ను నియమించినట్లు జగిత్యాల జిల్లా అధ్యక్షులు పైడిపెల్లి సత్యనారాయణ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ఇందూర్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీత వెంకట్, సురభి నవీన్ కుమార్,రఘున్న, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం వేణు గోపాల్,కౌన్సిలర్స్ మాడవేని నరేష్,శీలం జయలక్ష్మి, పెండెం గణేష్,తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ నెల 29 న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

సూర్య జగిత్యాల

జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఈనెల 29న ఎస్.కె.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ధర్మపురి రోడ్డులో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాకు సంబంధించిన కళాకారులు జానపద నృత్యం జానపద పాటలు గ్రూప్, సోలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, దీంతోపాటు కథ రచన, పోస్టర్ మేకింగ్, భావ ప్రకటన, ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహించి ప్రతి అంశంలోని విజేతలను నిర్ణయించి జనవరి 6న హైదరాబాద్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలియచేశారు. పోటీల్లో పాల్గొనే యువతీ యువకుల వయస్సు 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలలోపు ఉండాలని, పోటీలలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామాగ్రిని కళాకారులు తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయముకు లేదా 9704061725 నెంబర్ కి ఫోన్ చేసి సంప్రదించవలసినదిగా ఆయన పేర్కొన్నారు.

## సెల్ పాయింట్లో చోరీ

సూర్య జగిత్యాల



జగిత్యాల పట్టణంలోని అంగడి బజార్ లో గల రాజరాజేశ్వర సెల్ పాయింట్ లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు సెల్ పాయింట్ తాళాలు పగలగొట్టి షాపులోని దాదాపు పదివేల విలువగల వస్తువులు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఈనెల 28న ఉచిత నేత్ర వైద్య శిబిరం

సూర్య- కోరుట్ల

ఈనెల 28 గురువారం రోజున లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ వారి సంయుక్త ఆధ్వర్యంలో రేకుర్తి హాస్పిటల్ వైద్య బృందం చే కోరుట్ల పట్టణంలోని పద్మశాలి కళ్యాణ భవనంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వనపర్తి చంద్రమోహన్, కుందారపు మహేందర్ ,కొండబత్తిని అనంత కృష్ణ ప్రసాద్ లు తెలిపారు. కంటి చూపు లో పాలున్న వారిని పరీక్ష చేయించి , బిందు ఉన్న వారిని గుర్తించి ఆపరేషన్ అవసరం ఉన్నట్లయితే వెంటనే రేకుర్తి కి ఉచిత బస్సు సౌకర్యంతో తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు .అలాగే ఆపరేషన్ చేయించుకునేవారు తెల్ల రేషన్ కార్డు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని అన్నారు. పట్టణముతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.




## ఘనంగా అయ్యప్ప స్వామి పడి పూజ

సూర్య వెల్గటూర్



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం శ్రీశ్రీ పెండ్యాల బాల క్రిష్ణ గూరుస్వామి కరకమలములచే తిప్పర్తి చంద్రమౌళి (నారికేళి) గూరుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.18 మెట్లను ఏర్పాటు చేసి జ్యోతులను వెలిగించారు. స్వామియే శరణం అయ్యప్ప...శరణంశరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్పస్వామి నామస్మరణతో పార్వతి కోటేశ్వర స్వామి ఆలయం మార్మోగింది. ఈ మహాపడిపూజ మహోత్సవానికి పెద్దఎత్తున అయ్యప్పస్వాములు,భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం,భజన పాటలు భక్తి గీతాలనుఆలపించారు. అనంత రం(మహాభిక్ష) అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్,సర్పంచ్ నక్క మౌనిక రవితేజ, ఎంపిటిసి మూగల రాజేశ్వరి సత్యం,తో పాటు మహిళలు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

సూర్య ఎండపల్లి



మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన వ్యక్తి మంగళవారం ఆత్మ హత్య చేసుకోవడం జరిగింది, అని ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం గోడి శెలపేటకు చెందిన వన్నెల చుక్కరెడ్డి (52) అను వ్యక్తి గత 5 సంవత్సరాలనుండి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడిన కడుపు నొప్పి తగ్గకపోవడంతో జీవితం పై విరక్తి చెంది సోమవారం రోజున రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో కడుపునొప్పి భరించలేక క్రిమిసంహారక మందు తాగాడు, ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రోజున ఉదయం 9:30 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. ఇట్టి విషయమై మృతుని భార్య వన్నెల పద్మ తన భర్త కడుపు నొప్పి భరించలేక జీవితం పై విరక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

## మెట్ పల్లి లో ఘనంగా అయ్యప్ప పడిపూజ

సూర్య మెట్ పల్లి టౌన్



బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మంగళవారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయం లో ఇరవై ఏడవ సారి పడిపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పడిపూజ కార్యక్రమం లో అయన తనయుడు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దంపతులు మరియు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గూడెం గురుస్వామి పురుషోత్తమ చారి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో ఇరవై ఆరవ తారీకు రోజునా శబరిమలై పద్దెనిమిది మెట్ల పడిపూజ శబరిలో ఏవిధంగా అయితే జరుగుతుందో, అదే విధంగా మెట్ పల్లి లోని అయ్యప్ప దేవాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాన్ని ప్రజలు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని అందరి బాగు కోసము నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ అయ్యప్ప స్వాముల భక్త భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రణ వేని సుజాత సత్యనారాయణ, కోరుట్ల చైర్మన్ లావణ్య అనిల్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటీసీలు, జడ్పీటీసీలు, పట్టణ ప్రజలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో....గెలుపు ఎవరిదో ?

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. 7వ దఫా లో జరగనున్న ఈ ఎన్నికలలో 13 సంఘాలు అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి), తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్), సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టీయూసీ), సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్), సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్( హెచ్ఎంఎస్), సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు), సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టిఎన్టియూసీ), గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం, సింగరేణి గని కార్మిక సంఘం, తెలంగాణ సింగరేణి కార్మిక సంఘం, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం,తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రీజినల్ సింగరేణి కార్మిక సంఘం, సింగరేణి డ్రైవర్స్ ఈపి ఆపరేటర్ అండ్ అండర్ గ్రౌండ్ అల్ ట్రేడ్ వర్కర్స్ అసోసియేషన్ సంఘాలు పాల్గొననున్నాయి. ఈ క్రమంలో హెూరాహెూరీగా నిర్వహించిన ప్రచారం సోమవారం ముగిసింది. ఏఐటియుసి యూనియన్, ఐఎన్టియుసి యూనియన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్టియుసి తరపున మంత్రులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బిఆర్ఎస్ అనుబంధ యూనియన్ అయినటువంటి టిబిజికెఎస్ యూనియన్ మధ్యంతరంలో పోటీ నుంచి తప్పుకుంటు న్నట్లు వ్యవహరిస్తోంది.




టిబిజికెఎస్ యూనియన్ ద్వితీయ, తృతీయ సేనా నాయకులు, కార్యకర్తలు తమ వంతుగా గెలుపు కోసం కృషి చేస్తున్నారు.పోలింగ్ కేంద్రాలలోను 27వ తేదీ బుధవారం ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గం.ల వరకు నిర్వహించే ఈ ఎన్నికల్లో ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.ప్రతి ఓటరు / ఉద్యోగి విధిగా తమ గుర్తింపు కార్డును (ఐడెంటిటీ %--% శాశ్వత/తాత్కాలిక) వెంట తీసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలి. గతంలో 6 దఫాలుగా ఎన్నికలు నిర్వహించిన విధంగానే ఈసారి కూడా శాంతియుత మరియు సుహృద్భావ వాతావరణంలో నిర్వహించటానికి గాను కార్మికులు, కార్మిక సంఘాలు, అధికారులు, ప్రభుత్వం పంపిన కేంద్ర కార్మిక శాఖ అధికా రులు, రెవెన్యూ, పోలీస్ మరియు ప్రెస్ సిబ్బంది అందరూ సహకరించవలసినదిగా యాజమాన్యం విజ్ఞప్తి చేస్తున్నది. ప్రతిష్టాత్మకంగా మారిన ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో అని అందరూ వేచి చూస్తున్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

### ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**సూర్య - సుల్తానాబాద్**



కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం స్థానిక వైశ్య భవన్ లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే విజయ రమణారావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సుల్తానాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 116 మంది లబ్ధిదారులకు రూ.లు 1,16,13,456/- చెక్కులను ఎమ్మెల్యే విజయ రమణారావు చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన అన్ని పథకాలను లబ్ధిదారులకు అందజేస్తామని, డిసెంబర్ 28 నుండి రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుచేసి ప్రతి ప్రభుత్వ పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మినుపాల స్వరూపరాణి ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, తహశీల్దార్ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ లతోపాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ దత్తాత్రేయ జయంతి మహెూత్సవ వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం సెంటినరీ కాలనీ లోని శ్రీ కోదండ రామాలయం-శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం శ్రీ శ్రీ శ్రీ దత్తాత్రేయ మహెూత్సవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5:00 గంటలకు నగర సంకీర్తన, 6:00 గంటలకు కాగడ హారతి, 6:30 గంటలకు గణపతి పూజ, రక్షాబంధనము, 7:00 గంటలకు అభిషేకం (నవకలశ స్నపనం), దత్తా హెూమం (పూర్ణాహుతి), 9:00 గంటలకు,10:45 గంటలకు మహా పుష్పాభిషేకం, మధ్యాహ్నం 12:00 గంటలకు, మధ్యాహ్న హారతి, 12:30 గంటలకు తీర్థ ప్రసాదం, మహా ప్రసాద వితరణ( అన్నసంతర్పణ), సాయంత్రం 6:00 గంటలకు సంధ్య హారతి, 7:00 గంటలకు భజన, పల్లకి సేవ, రాత్రి 9:00 గంటలకు శేజ హారతి (పవళింపు సేవ) కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలలో చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, వర్కింగ్ చైర్మన్ గంట వెంకటరమణ రెడ్డి, వైస్ చైర్మన్ వనం రాంచందర్ రావు, సెక్రటరీ ముప్పిడి రవీందర్, కాటం సత్యం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సోదరులకు గౌడ సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ

**సూర్య మంథని**

పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన సోదరులు తాటి నాగరాజుగౌడ్, తాటి నవీన్ గౌడ్ లకు మంథని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలోసంతాప సభ నిర్వహించారు. ఈనెల16 న శనివారం రోజు రాత్రి 10 గంటల సమయంలో ట్రాక్టర్ ప్రమాదంలో మంథని శివారు లక్కేపూర్ క్రాస్ రోడ్ వద్ద దుర్మరణం పాలైన సోదరులు నాగరాజు గౌడ్, నవీన్ గౌడ్లకు మంథని గౌడసంఘం ఆధ్వర్యంలో , ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి ఆత్మ శాంతి కోసం మౌనంపాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, మాజీ అధ్యక్షులు మోహన్ గౌడ్, పూదరి సమ్మయ్య గౌడ్, రేణుక దేవాలయం చైర్మన్ సత్యనారాయణ గౌడ్, గౌడ సంఘం నాయకులు ఆరెల్లి కొమురయ్య గౌడ్, తాటి బుచ్చయ్య గౌడ్, పొన్నం మోహన్ గౌడ్, లక్ష్మయ్య గౌడ్, పొన్నం చంద్రయ్య గౌడ్, కిష్ట స్వామి గౌడ్, టి సాబ్ గౌడ్, సుభాష్ గౌడ్, తాటి రమేష్ గౌడ్, నాగేంద్రబాబు గౌడ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం...నిరుపేదలకు రగ్గుల పంపిణీ

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో నిరుపేదలకు రగ్గుల పంపిణీ అభినందనీయమని స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. మంగళవారం సెంటినరీ కాలనికి చెందిన దాతలు ప్రతిభ హెూం అండ్ కన్స్ట్రక్షన్ కాంట్రాక్టర్ పాల ప్రవీణ్, సాయి, అరేపల్లి అభిలాష్,లేవి ఆధ్వర్యంలో ఉచితంగా రగ్గుల పంపిణీ చేశారు.ఇప్పటికే మంథని,గోదావరి ఖని, పెద్దపల్లి బస్ స్టాండ్ లో,కల్వచేర్ల, పన్నూరు,సెంటినరీ కాలనీ లో ఇప్పటి వరకు 150 రగ్గులను నిరుపేద వృద్ధులకు అందించామని దాతలు తెలిపారు. చలి కాలం కావడంతో వృద్ధులు చలి భారీన పడకుండా ఉండేందుకు రగ్గులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ధర్మల రాజ సంపత్, ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి,వార్డు మెంబర్ బొంగురాల రవి,వేగోళపు మల్లయ్య, స్థానిక నాయకులు గిరవేన రాములు, భాద్రపు రంగయ్య,తొట్ల సాగర్ పాల్గొన్నారు.






## శ్రీ లక్ష్మీ నృసింహ స్వామికి మార్గశిర మాస పౌర్ణమి ప్రత్యేక పూజలు

**సూర్య- పెద్దపల్లి రూరల్**



మండలంలోని దేవునిపల్లి శ్రీ లక్ష్మీనృసింహస్వామి కి మార్గశిర మాస పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు కంజర్ల రామాచార్యులు ఆధ్వర్యంలో కొండపాక శ్రీకాంతాచార్యులు, లక్ష్మీ నారాయణ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, విశేషణ అలంకారణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉపాది హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని రాఘవపూర్, మారేడుగొండ, చీకురాయి, భోజన్నపేట, పెద్దబొంకూర్ , కాసులపల్లి, దేవునిపల్లి ,, హనుమంతుపేట, నిమ్మనపల్లి గ్రామాల్లో ఉపాది హామీ పథకం లో పూర్తి చేసుకున్న పనులను మరియు రికార్డుల సామాజిక తనిఖీ కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా ప్రాంగణాలు ,,గుట్టల వద్ద నీటి నిల్వల్ల కోసం తవ్విన గుంతలు, కందకాలు, ఎస్సారెస్పీ కాలువలు , చెరువు నుండి వెళ్లే కాలువలు పూర్తయిన పనుల రికార్డులను తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రమేష్ బాబు, జే ఈ రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఎసిపి

**సూర్య ఓదెల**

వార్షిక తనిఖీలలో భాగంగా పోత్కపల్లి పోలీస్ స్టేషన్ ని మంగళవారం రోజు పెద్దపల్లి ఎసిపి ఎడ్ల మహేష్ తనిఖీ చేశారు. కష్టతరమైన కేసులలో సత్వర పరిష్కారం కోసం నూతన టెక్నాలజీ వినియోగించాలని ఆయన అన్నారు. అధికారులతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణ లో పరిసరాలను పరిశీలించిన ఎసిపి రిసెప్షన్, బ్లూ కోట్ ,క్రైమ్ టీం, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ,స్టేషన్ రైటర్, క్రైమ్ రైటర్, ప్రాసెస్, సమన్స్ ,వారెంట్ ఆఫీసర్, సెక్షన్ ఇంచార్జ్, టెక్ టీం ,ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, ఎస్ హెచ్ ఓ వర్టికల్స్, పనితీరును తెలుసుకున్నారు. సిసిటిఎన్ఎస్ అప్లికేషన్ల పనితీరుని సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఆయన వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. పెండింగ్ కేసుల ఫైల్స్ ,రికార్డులను పరిశీలించి స్టేషన్ పరిధిలో గల నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో అన్ని సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని పోలీసులకు సూచించారు. 100 డయల్ ఫిర్యాదులపై తక్షణం తక్షణమే స్పందన ఉండాలని బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణ కృషి చేయాలని, రోడ్డు భద్రత ,సైబర్ నేరాలపై గంజాయి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలని తెలిపారు. ఏసిపి మహేష్ వెంట సుల్తానాబాద్ సిఐ జగదీష్ ,ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

## అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్య

**సూర్య ఇబ్రహీంపట్నం.**



మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన పున్నం శ్రీనివాస్ ( 33) అప్పుల బాధ భరించలేక ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. నాలుగు నెలల క్రితం తనకు కుమారుడు జన్మించగా పుట్టిన మూడు రోజులకే ఆపరేషన్ చేయవలసి వచ్చింది అందుకుగాను నాలుగు లక్షల వరకు ఖర్చు అయినప్పటికీ కుమారుడి ఆరోగ్యం బాగుపడలేదు దీంతో మనస్థాపానికి గురై ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. మృతుడికి భార్య, 4 నెలల కుమారుడు ఉన్నారు మృతుడి భార్య హరిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమా సాగర్ తెలిపారు.

# 28 వ తేది నుండి నగరపాలక సంస్థ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమం

**- 28 నుండి జనవరి 6 వరకు ఆరు గ్యారెంటీల పై దరఖాస్తుల స్వీకరణ -నగరపాలక సంస్థ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్.**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రజలకు చేరువగా పాలన అందించడానికి తెలంగాణ ప్రభుత్వం " ప్రజా పాలన" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని నగరపాలక సంస్థ కమీషనర్ బోనగిర శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాల అధికారు లు, సిబ్బందితో సోమవారం రోజు సమీక్షా సమావేశం దరిగింది. ఈ సమావేశంలో కమీషనర్ అధికారులకు, సిబ్బంది కి ప్రజా పరిపాలన కార్యక్రమం మర్గదర్శకాల పై దిశా నిర్ధేశం చేశారు. పలు సలహాలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పరిపాలన కార్యక్రమంను సమర్ధవంతంగా కొనసాగించేం దుకు నగర వ్యాప్తంగా ఉన్న 60 డివిజన్ లలో 10 డివిజన్ లకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తూ... డివిజన్ కు ఆరుగులు సిబ్బందిని కూడ నియమించారు. ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం నగరంలోని అర్హులైన లబ్ధిదారులకు దశల వారిగా నిర్ణీత కాల వ్యవధి లో సామాజీక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని డిసెంబర్ 28 వ తేది నుండి జనవరి 6 వ తేది వరకు 8 పని దినాలు డివిజన్ వారిగా దరఖాస్తులను




స్వీకరించనున్నారు. ప్రతి రోజు ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రజల నుండి వినతులను స్వీకరించనున్నారు. ప్రభుత్వ సెలవు దినాలు డిసెంబర్ 31,జనవరి 1 మినహాయించి డిసెంబర్ 28 నుండి జనవరి 6 వ తేది వరకు నిర్వహించనున్నారు. పట్టణ ప్రాంతంలో ప్రతి డివిజన్ కార్పోరేటర్ల సహకారంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం, రైతు బరోసా పథకం, గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్ల పథకం, చేయూత పథకాల పై ప్రజల నుండి దరఖాసు లను స్వీకరించనున్నారు. డివిజన్ లలో ప్రతి పథకానికి ఒక ఉద్యోగిని నియమిస్తూ... ఆరు గ్యారెంటీలకు ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ బోనగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వం పారదర్శకత, జవాబు దారి తనంతో క్షేత్రస్థాయిలో మెరుగైన పాలన అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనల ప్రకారం ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు సిబ్బంది సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా మెప్మా సిబ్బంది ప్రజా పాలన కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమం పై సమాచారం చేయ వేయాలన్నారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేలా మెప్మా మరియు ఆర్పీలు చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. ప్రతి డివిజన్ లో డివిజన్ కార్పోరేటర్ల సహకారంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం 8 పనిదినాల్లో ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించాలని పిలుపు నిచ్చారు. డివిజన్ ప్రకారం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రజల వద్ద నుండి దరఖాస్తులను తీస్కోవాలని అన్నారు. నగర ప్రజలు ప్రజా పాలన కార్యక్రమం లో సంక్షేమ పథకాల కోసం మీ డివిజన్ లలో నగరపాలక సంస్థ నియమించిన అధికారులకు ధరఖాస్తులను ఇవ్వాలని కమీషనర్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమీషనర్ స్వరూప రాణీ, ఈఈ మహేంధర్, ఆర్వో అంజనేయులు, అధికారులు, సిబ్బంది మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ న్యాయసేవా సదస్సు

**- కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలి**

**- జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరి కె. వెంకటేష్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఈనెల 30న కరీంనగర్ మరియు హుజురాబాద్ కోర్టులలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ కె. వెంకటేష్ తెలిపారు.శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణం లోని న్యాయ సేవా సదన్ బిల్డింగ్ లో జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ కరీంనగర్, హుజురాబాద్ కోర్టులలో డిసెంబర్ 30 శనివారం నాడు జాతీయ న్యాయ సేవా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ చేసుకోదగిన 2021 క్రిమినల్, 350 సివిల్ కేసులను గుర్తించడం జరిగిందని, రాజీయే రాజమార్గంగా భావించే రెండు వర్గాల వారు లోక్ అదాలత్ ద్వారా వారి కేసులను సత్వరంగా పరిష్కరించుకోవాలని కోరారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, కుటుంబ తగాదా సంబంధించిన కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ వెహికల్ చట్టం కు సంబంధించిన కేసులు, బ్యాంకు కేసులు మరియు చిట్ ఫండ్ కేసులను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించబడునని అన్నారు. కేసుల తుది తీర్పు ద్వారా ఒక వర్గం వారు మాత్రమే గెలుస్తారని, రాజీపడడం ద్వారా ఇరువర్గాలు గెలుస్తారని, రాజీ పడ్డ కేసులకు తిరిగి అప్పీలుకు వెళ్లే ఆస్కారం ఉండదని అన్నారు. లోక్ అదాలత్ లో రాజీ పడడం వల్ల కోర్టు ఫీజు మొత్తం తిరిగి ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులలో చాలాన్ తో పాటు జైలు శిక్ష వేసే అవకాశం ఉంటుందని, అలాంటి కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించి కొంతమేర వెసులుబాటు కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ.

**సూర్య,రాయికల్**

ప్రజలకు చేరువగా పాలనను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని పట్టణంతో పాటు,మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 28 నుండి జనవరి 06 వరకు (సెలవు దినాలను మినహాయించి) నిర్వహించబడునని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగుల సంతోష్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు పథకాలకు మహాలక్ష్మి పథకం,రైతు భరోసా,గృహలక్ష్మి,ఇందిరమ్మ ఇండ్ల పథకం,చేయూత పథకం సంబంధించిన దరఖాస్తులను పట్టణంలోని అన్ని వార్డులలో, మండలంలోని అన్ని గ్రామాల్లో పైన తెలిపిన షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేసిన వేదికలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఇతర దరఖాస్తుల కోసం అలాగే వికలాంగుల కొరకు మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులకు అనుసంధానంగా ఆధార్ కార్డు,తెల్ల రేషన్ కార్డ్ జత చెయ్యాల్సి ఉంటుందని,మండల ప్రజా ప్రతినిధులు,గ్రామాల్లోని ప్రజా ప్రతినిదులు, అధికారులు,సిబ్బంది కార్యక్రమం నిర్వహించబోయే తేదీలను సమయాన్ని ముందస్తుగా ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని కోరారు.

## కరాటే లో అంతర్జాతీయ జపాన్ బ్రౌన్ బెల్ట్ డిప్లొమా సాధించిన ఇబ్రహీంపట్నం విద్యార్థి

**సూర్య ఇబ్రహీంపట్నం**



జె.కె.ఏ.ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా నుండి 9 మంది విద్యార్థులు జపాన్ బ్రౌన్ బెల్ట్ డిప్లొమా పరీక్ష కు ఎంపిక కాగా సోమవారం జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా తెలంగాణ స్టేట్ ప్రధాన శిక్షకులు పరీక్ష నిర్వాహికులు రాపోలు సుదర్శన్ మాస్టర్ ఆధ్వర్యంలో కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యాలయం హైదరాబాదులో నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ఆర్ హర్షవర్ధన్ ఉత్తీర్ణత సాధించారు. అనంతరం మాస్టర్ రాపోలు సుదర్శన్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్ కుమార్, కరీంనగర్ డివిజనల్ ప్రధాన కరాటే కోచ్ సుంకే రాజు, కరాటే శిక్షకులు వంశినాయుడు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు....

**- సిపిఐ చరిత్రను ప్రజలకు వివరించిన సర్పంచ్ రమేష్**

**సూర్య చిగురు మామిడి.....**

చిగురుమామిడి మండలం లోని సుందరగిరి గ్రామములో సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, తెలంగాణ స్వరాష్ట్రం కోసం సైతం ఉద్యమించిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుందని సుందరగిరి గ్రామ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్,గ్రామశాఖ కార్యదర్శి గందె కొమురయ్యలు తెలిపారు.సిపిఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం సుందరగిరిలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కొమురయ్య ఆధ్వర్యంలో ఆవిర్భవ దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు.గ్రామ చౌరస్తాలో సిపిఐ పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రజలకు పెద్ద ఎత్తున స్వీట్స్ ను పంపిణి చేసి పండగ వాతావరణాన్ని సృష్టించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి,దున్నేవాడిదే భూమి అంటు ఉద్యమాలు చేసి పేదలకు భూములను పంపిణీ చేసిన ఘనత సిపిఐ పార్టీదేనని అన్నారు.దశబ్దాల కాలంగా పేద ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అని,సిపిఐ పార్టీ చరిత్రను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీముర్తి రమేష్,గ్రామ శాఖ కార్యదర్శి గందె కొమురయ్య, వార్డు సభ్యులు కంది శంకర్,కక్కెర్ల సంజీవ్ గౌడ్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తాళ్లపల్లి చిన్నచంద్రాయ్య గౌడ్, సహాయ కార్యదర్శి ఎనగందుల శ్రీనివాస్,నాయకులు శ్రీమూర్తి సాయి రెడ్డి,జీల సంపత్ యాదవ్,ఎనగందుల రాజు,మావురపు రాజు,నునేగోప్పుల ఐలయ్య,బుర్ర రాజయ్య గౌడ్,పుట్ట రవీందర్,కంది వెంకన్న,బొమ్మగాని కృష్ణ గౌడ్,బైరి శ్రీనివాస్ యాదవ్,జేరుపోతుల మైసయ్య,బరిగెల రాజయ్య, పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి చేయూతగా తోటి మిత్రులు

**సూర్య,రాయికల్**

రాయికల్ పట్టణానికి చెందిన ఇంద్రాల గంగారాం అనే యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా అతని కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు.రాయికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2002 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.77,000/- జమ చేసి,మృతి చెందిన స్నేహితుడు గంగారం కూతురు ఇంద్రాల కేశవర్ధిని యొక్క సుకన్య సమృద్ధి ఖాతా లో జమ చేయడం జరిగింది.అంతే కాకుండా పాప యొక్క ఈ ఖాతా ను పదిహేను సంవత్సరాల పాటు తామే కొనసాగించబోతామని తెలియజేస్తారు.తమ మిత్రుడు చిన్న వయసు లోనే మరణించడం చాలా బాధాకరం అని,వాళ్ల కుటుంబానికి అండగా తాము ఎలాంటి సహాయం కావాలన్నా ముందుంటామని స్నేహితులు పేర్కొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

**-వల్లంపట్లలో ఘటన -కొలనూర్ లో విషాదం**

**సూర్య కోనరావుపేట**



పొలం పనుల్లో ట్రాక్టర్ పై వరినారు తెస్తుండగా అదుపుతప్పి కల్వర్టులో ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..... కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన మెరుగు శ్రీనివాస్ (35)స్థానికంగా పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవిస్తున్నాడు.ఇటీవల వల్లంపట్ల గ్రామంలో శ్రీనివాస్ మామ మృతి చెందగా పొలం పనుల కోసం వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం ట్రాక్టర్ పై వరినారు తెస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పిన కల్వర్టులో బోల్తా పడడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు.దీంతో కొలనూర్ గ్రామంలో విషాదం నెలకొంది.పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి జెసీబీ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా హాస్పటల్ కు తరలించారు.మృతునికి భార్య సంధ్య, కుమారుడు హర్షవర్ధన్ లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కొలనూర్ సర్పంచ్ తుమ్మల యమున, ఎంపీటీసీ ప్రవీణ్ లు కోరారు.

## ఎన్నారై మస్కట్ గ్రూప్ సభ్యుల సహకారంతో నూతన దేవస్థానం నిర్మాణం.

**- గ్రామ ప్రజల సహకారంతో మహా అన్నదానం**

**సూర్య,రాయికల్4**

రాయికల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో పురాతన వినాయక విగ్రహంనకు ఎన్నారై మస్కట్ గ్రూప్ సభ్యుల సహకారంతో నూతన దేవాలయం నిర్మించి,విగ్రహ పున ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.డప్పు వాయిద్యాల తో,మేళా తాళాల నడుమ,వేద పండితులు మంత్రోచ్ఛారణలతో నవగ్రహ పూజ,కలుష పూజ,వినాయక హెూమం నిర్వహించి,స్వామివారి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట గావించరు.స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు,గ్రామస్తుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# దత్తాత్రేయ ఆలయాన్ని దత్తత తీసుకుంటా

## - అధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తా - బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

**సూర్య బోయినపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని వరదవెల్లిలోని దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దత్తత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ చెప్పారు. వరదవెల్లి ప్రాంతాన్ని ప్రసిద్ధి చెందిన అధ్యాత్మిక, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. భక్తులకు అవసరమైన పడవలను కూడా అందించేందుకు సిద్ధమని తెలిపారు. త్రిమూర్తుల స్వరూపమైన దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకుని బండి సంజయ్ కుమార్ ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, స్థానిక నేతలతో కలిసి పడవలో వెళ్లి మధ్యమానేరులోనున్న దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన దేవాలయ మైన దత్తాత్రేయ స్వామి వారిని దర్శించు కున్నా. స్వామివారిని దర్శించు కుంటే కోరిన కోర్కెలు తీరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది. దత్తాత్రేయ జయంతి సందర్భంగా మూడు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామి వారిని దర్శిం చుకోవడం దారి లేకపోవడం, సరైన సౌకర్యాలు లేకపోవడంవల్ల భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయ కమిటీ విజప్తి మేరకు దత్తాత్రేయ ఆలయాన్ని దత్తత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నా. అట్లాగే ఈ



ప్రాంతాన్ని ప్రసిద్ది చెందిన ధార్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నా అట్లాగే భక్తులు వెళ్లడానికి బోట్లు సమకూర్చే ందుకు సిద్ధంగా ఉన్నా. అవకాశ మిస్తే ఈ దేవాల యాన్ని దత్తత తీసుకుని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తనని అన్నారు. బిజెపి మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్ , ఉదారి నరసింహ చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేడ్డవేని గోపి, మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## రుద్రంగి చేరుకున్న అయోధ్య అక్షింతలు

**సూర్య రుద్రంగి**

అయోధ్యలో జనవరి 22న నిర్వహించే రామ మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి పూజించిన అక్షింతలు మంగళవారం రుద్రంగి చేరుకోగా జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, సర్పంచ్ తర్రె ప్రభలత-మనోహర్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ట్రస్టు నిర్వాహకులు రుద్రంగి మండలంలో అన్ని గ్రామాల ఆలయాలకు అక్షింతలు పంపారు. మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుండి అయోధ్య అక్షింతలు ఉన్న కలశాలను పల్లకిలో ఉంచి శ్రీ రామ నామస్మరణతో పూరవిధుల గుండా ఊరేగించారు. అయోధ్య అక్షింతలు ఉన్న కలశాల పల్లకికి గ్రామంలోని భక్తులు, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు తర్రె మనోహర్, మంచె రాజేశం, కొమిరె శంకర్, ఎర్రం గంగ నర్సయ్య, దయ్యాల కమలాకర్, చెప్యాల గణేష్, నంద్యాడపు వెంకటేష్, రాసురి నర్సరెడ్డి, మంచె రమేష్, సామ మహన్ రెడ్డి, సూర యాదయ్య, మనోజ్, గండి నారాయణ, లింగంలతో పాటు అయ్యప్ప స్వాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పూడూరు మండల సాధన జెఎసి సమావేశం

### - మండల జెఏసి ఏర్పాటు

**సూర్య కొడిమ్యాల:**

జగిత్యాల జిల్లా ప్రస్తుత కొడిమ్యాల మండల%శీ% లోని పూడూరు గ్రామం ను నూతన మండల కేంద్రము గా ఏర్పాటు చేయాలని గత కొన్ని రోజులుగా పూడూరు గ్రామం తో పాటు పరిసర గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. పూడూరు, గౌరాపూర్, నర్సింహులపల్లి, అప్పారావుపేట, తుర్కాస్ నగర్, నమిలికొండ, శ్రీరాములపల్లి, తిప్పాయపల్లి, నల్లగొండ, చెప్యాల, పది గ్రామాల తో కలిపి పూడూరు మండల కేంద్రము గా నూతనముగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ సమావేశం ను బుధవారం రోజు పూడూరు లోని సహకార సంఘం కార్యాలయ%శీ% నందు ఉదయం 11, గంటలకు ఏర్పాటు చేయడం జరుగుతుంది అని పది గ్రామాలకు సంబంధిచిన ప్రతి ఒక్కరు పాల్గోని ఈ సమావేశం ను విజయవంతం చేసి నూతన మండల%శీ% ఏర్పాటుకు సహకరించాలని పూడూరు మండల జెఎసి సభ్యులు కోరారు. ఈ సమావేశం లో పూడూరు మండల సాధన జెఎసి ని ఏర్పాటు చేయడం జరుగుతుంది అని తెలిపారు. పది గ్రామాలకు సంబంధిచిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని పూడూరు మండల సాధన జెఎసి ఏర్పాటుకు సహకరించాలని, మండల ఏర్పాటుకు పలు సూచనలు సలహాలు ఇవ్వాలని పది గ్రామాల ప్రజలను పూడూరు మండల సాధన జెఎసి సభ్యులు కోరారు.



## నన్ను పాత వరసలతోనే పిలవాలి

### - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్

**సూర్య బి కథలాపూర్**

నన్ను పాత వరసలు అన్నా, కాక, తమ్ముడు అనే పిలవాలని సార్, ఎమ్మెల్యే అని పిలవడం వద్దని ఎప్పటికి మీ వాడినేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కొరారు. మంగళ వారం మండలం లోని సిరికొండ, తక్కళ్ల పల్లి గ్రామాల్లో కృతజ్ఞత ర్యాలి లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను పాత వరసలతోనే పిలవాలని, నన్ను గెలిపించిన మీ రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చిన నా దృష్టి కీ తీసుకురావాలని అన్నారు. మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తక్కల్ల పల్లి - సిరికొండ బ్రిడ్జి నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరు పథకాలను ప్రతి ఇంటికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు ప్రజలకు తెలియడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 28 నుండి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. సిరికొండ కు చెందిన తిరుపతి తల్లి కరెంట్ షాక్ తో మరణించడంతో విద్యుత్ శాఖ అధ్వర్యంలో ఎమ్మెల్యే ఐదు లక్షల చెక్ ను అందజేశారు. అంతకు ముందు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ను గ్రామానికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, అజీమ్, తొట్ల అంజయ్య, బైరా దేవ్ యాదవ్, యాగండల రమేశ్ గౌడ్, శ్రీహరి, దనం జయ్ రెడ్డి, హరి ప్రసాద్, మొలిగే లక్ష్మి - శ్రీనివాస్, కూ న శ్రీనివాస్, లింగం గౌడ్, వంశీ , వెలిచాల సత్యనారయణ, కట్ట శంకర్, కల్లేద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి ప్రజాపాలన సభలు

**సూర్య కోరుట్ల రూరల్**

రాష్ట్రములోని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలకు చేరువగా పాలనను అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలను ఈ నెల 28 నుండి చేపట్టనున్నట్లు ఎంపీవో నీరజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5 పథకాలకు ఈ నెల 28నుండి జనవరి 6వ తేదీ వరకు పనిదినాల్లో ఆయా గ్రామాల్లో చేపట్టే వేదికల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్ళు, చేయూత వంటి పథకాలకు దరఖాస్తులు చేసుకొనే వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డుల జిరాక్స్ లను జాతచేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 28న అయిలాపూర్, పైడిమడుగు, 29న మాదాపూర్, మోహన్ రావుపేట, 30న జోగిన్ పెల్లి, యూసుఫ్ నగర్, జనవరి 2న చిన్నమెట్ పెల్లి, వెంకటాపూర్, 3న ధర్మారం, నాగులపేట, 4న గుంలాపూర్, సంగేమ్, 5న కల్లూరు, సర్పరాజ్ పల్లె, 6న తిమ్మాయిపల్లి గ్రామాల్లోని గల గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో ప్రజాపాలన వేదిక చేపట్టనునట్లు పేర్కొన్నారు. ఇట్టి అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.




## పూడూరు మండల ఏర్పాటుకు జడ్పీటిసి మద్దతు

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి కృష్ణారావు నూతనముగా పూడూరు మండల%శీ% ఏర్పాటుకు సంపూర్ణంగా పూర్తి మద్దతు ను తెలియజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ పూడూరు మండల సాధన కోసం జెఎసి ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అని అన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రజల సౌకర్యర్థం కోసం నూతనముగా పూడూరు మండల%శీ% ను ఏర్పాటు చేయాలని కోరారు. మండల సాధన కోసం ఏర్పాటు కు జెఎసి కి మా పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విజ్ఞప్తి ని అర్దం చేసుకోని వెంటనే నూతనముగా పూడూరు మండల%శీ% ను ఏర్పాటు చేయాలని కోరారు. మండల సాధన కు మా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



## రెండవ రోజు కొనసాగిన దత్త జయంతి ఉత్సావాలు

### - ఘనంగా దత్త జయంతి వేడుకలు

**సూర్య బోయినపల్లి**

దత్త త్రెయున్ని దర్శించుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్ రావు. బోయినపల్లి మండలం వరదవెల్లి లో స్వయంబుగా వెలిసిన శ్రీ దత్త త్రేయ 43 వ జయంతి ఉత్చవాలో భాగంగా రెండవ రోజు మంగళ వారం దత్త త్రేయుని జన్మ దినం సందర్బంగా సత్య దత్త వ్రతాలు ఘనంగా జరిగాయి. సత్య దత్త వ్రతాలకు అధిక సంఖ్యలో బక్తులు హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆలయ అర్చకులు దత్త త్రేయిని చరిత్ర ని వివరించారు. దత్త త్రేయుని ఆలయం లో ప్రత్యేక పూజలు చేయడం తో పాటు అభిషేకాలు హారతి, బజాన కార్యక్రమాలు నిర్వహించారు. దత్త త్రేయ స్వామి ఆలయం శ్రీ రాజ రాజేశ్వర జలాశయం లో మునిగి పోవడం తో ఆలయ కమిటి వారు రెండు బోట్ లను ను ఏర్పాటు చేయగారెండవ రోజు దత్త త్రేయున్ని దర్శించుకొవాడానికి బారులు తీరారు. జలాశయం లో సెల్పి లు తీసుకుంటూ అహ్లదాన్ని ఆస్వాదించారు .ఒక్కరికి 250రూపాయలను బొట్ కు టికెట్ ఏర్పాటు చేసారు . దత్తాత్రేయుని జయంతి పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు .వరద వెల్లి గ్రామం భక్తజన సందర్భంగా మారింది .గుట్ట పై ఉన్న దత్త త్రేయున్ని దర్శించుకునేందుకు బోట్ల లో వెళ్లేందుకు దాదాపు రెండు గంటలకు పైగా సమయం పట్టింది. దత్తాత్రేయుని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ బి. ఆర్. ఎస్ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్ రావు లు దర్శించుకుని మో క్కులు చెల్లించుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య , సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# జిల్లాలో ప్రజాపాలన గ్రామ, వార్డు సభలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**- ప్రతి రోజు రెండు షిఫ్టులలో ప్రజాపాలన గ్రామసభల నిర్వహణ**

**- ప్రజాపాలన గ్రామ, వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**సూర్య రాజన్న సిరిసిల్ల.**

జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి లతో కలిసి ప్రజాపాలన గ్రామ,వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి సన్నాహక ఏర్పాట్ల పై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తహశీల్దార్ లు, ఎంపిడివో లతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని , డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి మండలం పరిధిలో తహసిల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ప్రజాపాలన సభలలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.మహాలక్ష్మి , రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు ఈ సభలలో స్వీకరించడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి దరఖాస్తులు ఒకరోజు ముందుగానే వస్తాయని, గ్రామ ప్రజలకు ముందుగానే దరఖాస్తులు అందించాలని అన్నారు. దరఖాస్తు దారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలోని నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరించేలా చూడాలని అన్నారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించిన షెడ్యూలు అందించడం జరుగుతుందని, ప్రజాపాలన నిర్వహణపై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని తీసుకోవా ల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించు కోవాలని, ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రజా పాలన సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు తెలియజేయాలని, మున్సిపాలిటీ లలో పారిశుద్ధ్య సిబ్బందిచే ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు స్వీకరించాలని, ఆధార్, రేషన్ కార్డు జత చేసేలా చూడాలని అన్నారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు ఫారంలు అందిన వెంటనే మండలాలకు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు ప్రజాపాలన సభలలో తీసుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క దరఖాస్తును స్వీకరించాలని చెప్పారు. దరఖాస్తుదారునికి రసీదు అందించాలని, ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ పూజారి గౌతమి మాట్లాడుతూ మహాలక్ష్మి , రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని,దరఖాస్తుదారులు ముందస్తుగా దరఖాస్తు ఫారం నింపుకొని గ్రామ సభకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామసభ నిర్వహణపై డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజాపాలన గ్రామసభ నిర్వహించే ప్రదేశం, సమయం, వివరాలు ముందస్తుగా ప్రచారం చేయాలని, స్థానిక జడ్పిటిసి, ఎంపిటిసి సర్పంచ్, మొదలగు నాయకులకు తప్పనిసరిగా ఎంపీడీవో లేదా తహసిల్దార్ ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని అన్నారు. విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య ,రెవెన్యూ డివిజన్ అధికారులు, ఆనంద్ కుమార్, మధు సూదన్ రెడ్డి, జెడ్పీ సి.ఈ.ఓ. గౌతమ్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి కొండల్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# "ప్రజా పాలన" అధికారుల నియామకం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లాలో ప్రజా పాలన పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా, నియోజక వర్గం, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. ప్రజా పాలన జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర ను నియమించామని తెలిపారు. అలాగే కోరుట్ల నియోజక వర్గానికి కోరుట్ల ఆర్డీఓ ఎస్.రాజేశ్వర్, జగిత్యాల నియోజక వర్గానికి జగిత్యాల ఆర్డీఓ కే.నరసింహ మూర్తి, ధర్మపురి నియోజక వర్గానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే. లక్ష్మి నారాయణ, చొప్పదండి నియోజక వర్గం నకు జీ.శ్రీనివాస్ రావ్, వేములవాడ నియోజక వర్గానికి మెట్ పల్లి ఆర్డీఓ డి.మధు లను ప్రత్యేక అధికారులుగా నియమించామని తెలిపారు. అదే విధంగా జిల్లా లోని 18 మండలాలకు ఆయా తహశీల్దార్,మండల అభివృద్ధి అధికారులతో పాటు ప్రత్యేక అధికారులను నియమించామని పేర్కొన్నారు. బీర్పూర్ మండలానికి సి.సుధీర్ , బుగ్గారం మండలానికి డి. ప్రకాష్ జిల్లా మార్కెటింగ్ అధికారి, ధర్మపురి మండలానికి ఎండీ అబ్దుల్ రెహమాన్ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, గొల్లపల్లి మండలానికి ఎల్.సాయిబాబా ఇబ్రహీం మండలానికి రఘువరన్ జగిత్యాల గ్రామీణ మండలానికి అఫ్జల్ హుస్సేన్ ఖాన్ ఇరిగేషన్ ఈఈ, జగిత్యాల అర్బన్ మండలానికి కే.రాజ్ కుమార్ , కతలాపూర్ మండలానికి బి.వెంకటేశ్వర రావు జిల్లా అటవీ అధికారి, కొడిమ్యాల్ మండలానికి జే.ప్రతాప్ సింగ్ కోరుట్ల మండలానికి ఎం.శ్రీనివాస్ రోడ్లు భవనాలు, మల్లాపూర్ మండలానికి పి.నరేష్ DRdo , మల్యాల మండలానికి పి.సురేష్ జిల్లా వ్యవసాయ అధికారి, మేడిపల్లి, భీమారం మండలాలకు ఎం.సత్యనారాయణ జిల్లా సహకార అధికారి, మెట్ పల్లి మండలానికి భాస్కర్ జిల్లా సంక్షేమ అధికారి, పెగడపల్లి మండలానికి కే. వేంకటేశ్వర రావు DVAHO, రాయికల్ మండలానికి జగన్ మోహన్ జిల్లా విద్య శాఖ అధికారి, సారంగాపూర్ మండలానికి మిలింద్ పంచాయతీ రాజ్ DY.EE వెల్గటూర్, ఎండపల్లి మండలాలకు బి. నారాయణ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి లను నియమించామని తెలిపారు. జిల్లాలోని ఐదు మునిసిపాలిటీ లకు కూడా ప్రత్యేక అధికారులను నియమించామని, జగిత్యాల పురపాలక సంఘానికి బి.నరేష్, AD DVAHO, కోరుట్ల మున్సిపాలిటీకి విజయ్ కుమార్ రాథోడ్ AD మైనింగ్, మెట్ పల్లి మున్సిపాలిటీకి ఏ. ప్రేమ్ కుమార్ మిషన్ భగీరథ డి.ఈఈ, రాయికల్ మున్సిపాలిటీకి దేవేందర్ రెడ్డి DRDO సహాయ మేనేజర్, ధర్మపురి మున్సిపాలిటీకి రోహిత్ మిషన్ భగీరథ dy.ee లను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# దరఖాస్తుల స్వీకరణ..

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని , డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం పరిధిలో తహసిల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి, ప్రతిరోజు ప్రతి బృందం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు , మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షెడ్యూల్లో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ప్రజాపాలన సభలలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. మహాలక్ష్మి , రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి దరఖాస్తులు ఒకరోజు ముందుగానే వస్తాయని, గ్రామ ప్రజలకు ముందుగానే దరఖాస్తులు అందించాలని, దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలోని నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరించేలా చూడాలని అన్నారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించిన షెడ్యూలు అందించడం జరుగుతుందని, ప్రజాపాలన నిర్వహణపై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రజా పాలన సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు తెలియజేయాలని, మున్సిపాలిటీ లలో పారిశుద్ధ్య సిబ్బందిచే ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు ఫారంలు అందిన వెంటనే మండలాలకు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జెడ్పీ సీఈఓ ను ఆదేశించారు. ప్రతిరోజు ప్రజాపాలన సభలలో తీసుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి రసీదు అందించాలని, ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ మహాలక్ష్మి , రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని, దరఖాస్తుదారులు ముందస్తుగా దరఖాస్తు ఫారం నింపుకొని గ్రామ సభకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామసభ నిర్వహణపై డప్పు చాటింపు ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, జెడ్పీ సి.ఈ.ఓ. శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎం.పి.డి.ఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పథకాలు అమలు చేసేంతవరకు పోరాడుతాం

**- ఆడబిడ్డల అండగా నిలిచింది కేసీఆర్ ప్రభుత్వం - ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**సూర్య,రాయికల్**

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన పథకాలు అమలు చేసేంతవరకు పోరాడుతాం అని, ఆడబిడ్డ లకు అండగా నిలిచింది కేసీఆర్ ప్రభుత్వం అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణ, మండలానికి చెందిన 27 మంది ఆడబిడ్డలకు రాయికల్ పట్టణ వర్తక సంఘం లో కళ్యాణ లక్ష్మి చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్ల పాలనలో రైతు సంక్షేమ పథకాలను కెసిఆర్ అమలు చేశారని ఆయన అన్నారు. ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి,షాది ముబార క్,బీడీ పెన్షన్ ,కెసిఆర్ కిట్, ఆరోగ్య మహిళ,మహిళ గురుకులాలు ఏర్పాటు చేసినది బిఆర్ఎస్ ప్రభుత్వమని ఆయన అన్నారు.జగిత్యాల నియోజకవర్గంలో 25 వేల మందికి బీడీ పెన్షన్ అందజేశామని,దేశంలోనే తలసరి ఆదాయం లో తెలంగాణ అగ్ర భాగాన నిలిచేలా చేసింది కేసిఆర్ అని అన్నారు.కాంగ్రెస్ పార్టీ మ్యాని ఫేస్టో లో ఉన్న అంశాలు అమలు అయ్యే విధంగా ప్రజల పక్షాన కోట్లాడతామని, కాంగ్రెస్ పార్టీ కొత్త పాలన చేపట్టడం వారికి కొంత సమయం ఇస్తామని, పథ కాలు తొందర్లోనే అమలు చేయాలి అని అన్నారు. ప్రతి పక్ష పార్టీలు కుల, మత రాజకీయాలు చేస్తున్నాయని,ప్రజలు అలాంటి పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం చేసే పార్టీ లను ఆదరించాలి,అప్పుడే ప్రజల ఆర్థిక సామాజిక పరిస్థితులు మారుతాయని, ఆదిశగా ప్రజలు ఆలోచన చేయాలి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అప్పుల రాష్ట్రం



గా చూపే ప్రయత్నం చేస్తు,తెలంగాణ ప్రతిష్ట దెబ్బ తీసే ప్రయత్నం చేస్తుంది అని అన్నారు.బి అర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వేద పత్రాన్ని విడుదల చేసి, తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృ ద్దే, 2014 ముందు ఉన్న పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించారు అని అన్నారు.ప్రతి గ్రామంలో,వార్డు లలో గ్రామ,వార్డు సభలో ప్రతి బి అర్ ఎస్ నాయ కులు పాల్గొని ప్రజల పక్షాన ఉండాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు,ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రాణి సాయికుమా ర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,వైస్ ఎంపీపీ మహేశ్వర రావు,మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గన్నె రాజీ రెడ్డి,రాయికల్ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్,ఉప అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సర్పంచులు ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు ముఖీద్, సర్పంచులు, ఎంపీటీసీలు,ప్రజా ప్రతినిదులు, నాయకులు ,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ తెరపైకి పివి జిల్లా ఏర్పాటు అంశం

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ కేంద్రంగా పివి జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్నికల అనంతరం పివి జిల్లా సాధన జేఏసీ కార్యక్రమాలు చేపడుతుండడంతో పివి జిల్లా ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. పరిపాలన కేంద్రీకృతంగా కాకుండా వికేంద్రీకరణ జరగాలని ఉద్దేశంతో అప్పటి సీఎం కేసీఆర్ 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ ఏర్పడ్డ తొలినాళ్లలో 10 జిల్లాలు, 48 రెవెన్యూ డివిజన్ తో, 466 మండలాలతో ఉన్న తెలంగాణను పరిపాలన సౌలభ్యం కోసం చిన్న జిల్లాలుగా చేయాలని సంకల్పంతో కమిటీలను ఏర్పాటు చేసింది. కమిటీల సిఫార్సు మేరకు ప్రజల విజ్ఞప్తుల మేరకు పది జిల్లాల తెలంగాణ 33 జిల్లాలుగా, 68 రెవెన్యూ డివిజన్లుగా, 584 మండలాలుగా మారింది. తిరిగి 2021లో రెండు జిల్లాల పేర్లను మార్చింది. కాగా 2016లో హుజురాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని పార్టీలకతీతంగా హుజురాబాద్ కు చెందిన నాయకులు జేఏసీగా ఏర్పడి ఎన్నో పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా అప్పటి మంత్రి ఈటల రాజేందర్ కు, ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు జిల్లాల పునర్వ్యవస్థీకరణ మెంబర్ గా ఉన్న కే. కేశవరావుకు జిల్లా ఏర్పాటు కోసం అనేక విజ్ఞప్తులు చేశారు. ఈ సందర్భంగా ధర్నాలు దీక్షలు చేస్తున్న సందర్భంలో అప్పటి మంత్రి



ఈటల రాజేందర్ జిల్లా సాధన కోసం చేస్తున్న నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు జరిగాయి. తర్వాత కొన్నాళ్లకు జిల్లా ఏర్పాటు కోసం ప్రయత్నించిన నాయకులు, ప్రజా సంఘాలు పోరాటానికి కొంత విరామం ఇచ్చాయి. ఇటీవల సాధారణ ఎన్నికల ముందు జిల్లా ఏర్పాటు కోసం తిరిగి ర్యాలీలు, ధర్నాలు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా జేఏసీ నాయకులు అప్పటి సీఎం కేసీఆర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, కెప్టెన్ లక్ష్మీకాంత రావు, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి, ప్రణవ్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, శ్రీధర్ బాబు, అప్పటి టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, తెలంగాణ జన సభ నాయకులు ప్రొఫెసర్ కోదండరాం, బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లకు జిల్లా ఏర్పాటు కోసం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి సైతం జిల్లా ఏర్పాటుకు తన సంఘీభావం ప్రకటించారు. టిఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న కౌశిక్ రెడ్డి సైతం ప్రభుత్వం జిల్లా ఏర్పాటు చేసే వరకు అభివృద్ధిని కొనసాగిద్దామని, అప్పుడు తప్పనిసరిగా వారు చేయాల్సి వస్తుందని అభిప్రాయపడగా, రేవంత్ రెడ్డి జిల్లా ఏర్పాటుకు ప్రణవ్ బాబును ముందుకు రావాలని సూచించారు. ఎన్నికల క్రమంలో కొంత ఉద్యమం వెనక్కి తగ్గిన తిరిగి ఎన్నికల అనంతరం పివి జిల్లా సాధన కోసం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ను హుస్నాబాద్ లో కలవగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాగా పివి జిల్లా సాధన సమితి వివిధ కార్యక్రమాలు చేపడుతుండడంతో మళ్లీ జిల్లా ఏర్పాటు అంశం తెర పైకి వచ్చింది.



## ముగిసిన వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు...

**సూర్య ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర ఉత్సవాలు మంగళవారం ముగిసాయి. చివరి రోజు హెూమ పూజను నిర్వహించి శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను రథంలో భక్తులు తాళ్లతో లాగుతూ దేవాలయం చుట్టూ తిప్పి మొక్కులను చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో అర్చకులు చక్రపాణి మాధవాచార్యులు సత్యనారాయణ సంతోష్ ప్రవీణ్ చార్యులు మండల కో ఆప్షన్ సభ్యులు చిన్నారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి పై కేసు నమోదు

**సూర్య, వీణవంక**

వీణవంక మండల కేంద్రంలో విద్యుత్ బకాయి బిల్లులు వసూలు చేస్తున్న విద్యుత్ అధికారిని విధులకు ఆటంకం కల్పించిన ఎండి. యాసీన్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్.హెచ్.వో విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... బిల్ కలెక్టర్ ఎల్కపల్లి సృజన సోమవారం గ్రామ పంచాయితి ముందు బిల్లులు వసూలు చేస్తున్నా సమయంలో యాసీన్ ఆమె వద్దకు వచ్చి 1640 సర్వీస్ నంబర్ పాత బిల్లు గురించి అడుగాగ పాత బిల్లు బకాయి ఉన్నాందున కట్ చేశామని, మిగిత వివరాల కోసం ఈ.ఆర్.వో ఆఫీస్ లో సంప్రదించాగలరని తెలుపగా వినకుండా పీఆర్ బుక్, డబ్బులు లాకోన్ని కుర్చీతో దాడి చేసేందుకు ప్రయత్నించి తన విధులకు ఆటంకం కల్పించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఉన్నాతధికారులతో కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా సిపిఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలో సిపిఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సిపిఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26 పుట్టిన సీపీఐ ఎన్నో సమరాలు చేసిందని, మరెన్నో త్యాగాలు చేసి నాటి నుండి నేటి వరకు అమరవీరుల అరుణ రక్తపు ధార సాక్షిగా ఎరుపెక్కిన ఎర్రజెండా 90 ఏళ్లుగా రెపరెపలాడుతూనే ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర ఉద్యమం సూర్య రంగంలో పలువురు విప్లవకారులు, దేశభక్తులు కమ్యూనిజం స్థాపన లక్ష్యంగా కాన్పురులో సమావేశమై భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించారు. అదే సిపిఐ ఆవిర్భావ దినం ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర పాలకులపై పోరాటాలను నిర్వహించిన అగ్ర భావన చాలు గెలిచింది. సిపిఐ తెలంగాణ రైతాంగ సాధన పోరాటం సాగించి నైజాం రాజరిక వ్యవస్థను నిర్మూలించడంతో పాటు 10 లక్షల హెక్టార్లలో భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత సిపిఐకే ఉందని, ప్రజా వ్యతిరేక విధానాలపై అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను భారత కమ్యూనిస్టు పార్టీ మరింత బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉందని ఆహ్వానించారు. మంగళవారం శంకరపట్నం లో టిఆర్ఎస్ పార్టీ నుండి గోదారి లక్ష్మణ్ ని సిపిఐ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కన్నం సదానందం, కొత్తగట్టు గ్రామ శాఖ కార్యదర్శి జానపద దేవయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎండి బాదుల్లా, తాడికల్ సహాయ కార్యదర్శి స్వామి, అన్ని గ్రామాల



కార్యదర్శులు, కార్యకర్తలు, కొత్తపెల్లి మొగిలి, ఆటో కార్మికులు, హమాలి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ మహా శక్తి దేవాలయం లో అయ్యప్ప స్వామి పడి పూజ లో పాల్గొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

**సూర్య, శంకరపట్నం**



శంకరపట్నం మండలం మెట్ పల్లి గ్రామానికి చెందిన తోట బసవయ్య అనే వ్యక్తి ఇల్లు మంగళవారం షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. బసవయ్య పొలంలో నాటు వేయడానికి వెళ్ళగా ఇంటి నుండి పొగలు రాగా చుట్టుప్రక్కల వాళ్ళు గమనించి బిందెలతో నీళ్లు పోసి మంటలను ఆర్పేశారు. సమాచారం తెలుసుకున్న బసవయ్య ఇంటికి వచ్చేసరికి ఇల్లు మొత్తం దగ్ధం అవడంతో ఇటీవల వరి ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు తన ఇంట్లో ఉండగా రూ. 1,50,000 రూపాయలతో పాటు టీవీ, బట్టలు తదితర వస్తువులు సామాగ్రి దగ్ధమైంది. మొత్తం ఆస్తి నష్టం సుమారు ఐదు లక్షల 50 వరకు నష్టం జరిగినట్టు బసవయ్య కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని బసవయ్య విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

**సూర్య, శంకరపట్నం**



జీబు - బైకు ఢీ కొట్టుకోవడంతో ఇద్దరికి తీవ్ర గాయలైన ఘటన మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో జరిగింది. వివరాల ప్రకారం.... మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామం మెయిన్ రోడ్డు హైవే పైన కరీంనగర్ నుండి హుజురాబాద్ వైపు వెళ్తున్న జీబు సింగాపూర్ నుంచి బైక్ పై భార్యాభర్తలు నెల్లూరు జిల్లాకు చెందిన బోడ మధు( 24), అతని భార్య శాంతి(20), కూతురు కిషిక, ముగ్గురు కేశవపట్నం కు వస్తుండగా గొల్లపల్లి వద్ద జీపు ఢీ కొనడంతో కీషిక కు, మధుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు చూసి 108కు ఫోన్ చేయడంతో సిబ్బంది ఏఎంటి సతీష్ రెడ్డి, పైలెట్ కాజా ఖలీల్ లాల్, ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. కిషిక పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం కు తరలించడం జరిగిందని సిబ్బంది తెలిపారు. ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.